క్లుప్తంగా

గ్రంథాలయాల ప్రాధాన్యత గుర్తించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: విద్యార్థులు గ్రంథాలయాల ప్రాధాన్యతను గుర్తించాలని తద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాలలో బుధవారం గ్రంథాలయ ముగింపు వారోత్సవాలు గ్రంథాలయాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. మరో వైపు కళాశాలలో వాణిజ్య శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతితో కలసి జీవించడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమని ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చెన్నారెడ్డి, భాస్కర్‌నాయుడు, నారాయణ, ప్రతాప్, రామన్న, ప్రసాద్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గా అమర్‌నాథ్‌రెడ్డి



పెనుకొండ రూరల్: పెనుకొండ మార్కెట్‌యార్డ్ నూతన వైస్ చైర్మన్‌గా శెట్టిపల్లికి చెందిన నల్లపరెడ్డి గారి అమర్నాథ్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే శంకరనారాయణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


ప్రతిభ కనబరచిన విద్యార్థితో ఉపాధ్యాయులు

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లి జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.జగన్‌బాబు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఫిజికల్ డైరెక్టర్ బీడీ మంజమ్మ, హెచ్ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 18న చిత్తూరు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14 ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. ఇందులో భాగంగానే బుధవారం సాయంత్రం పాఠశాల ఆవరణలో జగన్‌బాబును అభినందించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివప్ప

చిలమత్తూరు: మండలంలోని 44 వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో టాటాఏస్ ప్యాసింజర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో మండలంలోని కోడూరు తుమ్మలకుంటకు చెందిన శివప్పకు తీవ్ర గాయాలయ్యాయి. బాగేపల్లి వైపు నుంచి వస్తున్న శివప్ప చెక్‌పోస్ట్ చేరుకునే క్రమంలో అనంతపురం వైపు నుంచి వచ్చి టాటాఏస్ వాహనం చిలమత్తూరు వైపునకు అకస్మాత్తుగా తిప్పడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గాయపడిన శివప్పను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పట్టు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి


తాడేపల్లిలో సజ్జల రామక్రిష్ణారెడ్డిని కలిసిన పట్టు రైతులు

మడకశిర: మడకశిర, హిందూపురం నియోజకవర్గాలకు చెందిన పట్టు రైతులు బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డిని కలిశారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ చిగిచెర్ల ఓబిరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పట్టు రైతుల సంఘం అధ్యక్షుడు ధనాపురం వెంకట్రామిరెడ్డి తదితరులు కలిసి పట్టు రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారితో రైతుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న బైవోల్టిన్ పట్టు రైతుల ప్రోత్సాహక ధనాన్ని మంజూరు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. దాదాపు రూ.4 కోట్ల నిధులను మంజూరు చేయడానికి అడిషనల్ డైరెక్టర్ హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

జోరుగా పంటల సాగు

- రబీ పంటల సాగుకు అన్ని విధాలా ప్రభుత్వ ప్రోత్సాహం
- ఇప్పటికే 1,700 హెక్టార్లల్లో పంటలు
- ఆర్బీకేల ద్వారా సబ్సిడీ విత్తనాల పంపిణీకి చర్యలు


గొల్ల హట్టి సమీపంలో వేరుశనగ విత్తనాలు విత్తుతున్న దృశ్యం

మడకశిర రూరల్: వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని బోరు బావుల కింద రైతులు రబీ పంటల సాగులో రైతన్నలు నిమగ్నమయ్యారు. బోరు బావుల్లో సమద్ధిగా నీరు వస్తుండటంతో రైతులు వివిధ పంటలను సాగు చేయడానికి భూములను సిద్ధం చేసుకొంటున్నారు.

రబీపైనే ఆశలు

ఈఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంటసాగు చేసిన రైతులు నష్టపోయారు. ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి రబీ పంటలపై అన్నదాతలు ఎన్నో ఆశలు పెట్టుకొని పంటల సాగుకు సిద్ధమయ్యారు. కనీసం రబీ పంటలోనైనా మంచి దిగుబడి సాధించి ఖరీఫ్‌లోని నష్టాన్ని కొంత వరకైనా తగ్గించుకోవాలని భావిస్తున్నారు. ఇప్పటికే రైతులు బోరు బావుల కింద వివిధ పంటలను సాగు చేశారు. కృష్ణాజలాలతో పాటు గత ఏడాది కురిసిన వర్షాలకు మండలంలోని మణూరు, ఉప్పిడిపల్లి, కల్లుమర్రి, హరేసముద్రం, మడకశిర గౌడనహల్లి, ఆమిదాలగొంది, వైబీ హళ్లి, ఛత్రం చెరువులు నిండి మరువలు ప్రవహించడంతో భూగర్భజలాలు పెరిగి బోరు బావుల్లో నీరు వస్తున్నాయి.

అన్ని విధాలా ప్రోత్సాహం

ప్రభుత్వం రబీ పంటల సాగును మరింతగా ప్రోత్సహిస్తోంది. రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఇటీవలనే రైతు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ చేసింది. ఆర్బీకేల ద్వారా సబ్సిడీతో వేరుశనగ, రాగులు అందించడానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే గ్రామస్థాయిలోని ఆర్బీకేల ద్వారా సబ్సిడీ విత్తనాలు పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు.

ఇప్పటికే 1,700 హెక్టార్లలో..

రబీలో ఎక్కువ విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మడకశిర వ్యవసాయశాఖ డివిజన్‌లో 1,700 హెక్టార్లకు పైగా రైతులు వివిధ పంటలను సాగు చేశారు.

ఆరు ఎకరాల్లో పంటలు



బోరు బావుల కింద రబీలో రాగి, మొక్కజొన్న, వరి పంటలను ఆరు ఎకరాల్లో సాగు చేస్తున్నాను. ప్రభుత్వం ఇప్పటికే పెట్టుబడి సాయం ఖాతాలోకి జమ చేయడంతో ఇబ్బంది లేకుండా పంటలను సాగు చేస్తున్నాం. ఈ ఏడాది ఖరీఫ్‌లో బోరు కింద సాగు చేసిన మొక్కజొన్న పంటలో ఖర్చులు పోనూ రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చింది.

– శ్రీరామరెడ్డి రైతు, ఎల్లోటి, మడకశిర

ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది



రబీ పంట సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. బోరు బావుల్లో కూడా నీరు సమద్ధిగా వస్తుండడంతో ఐదు ఎకరాల్లో వేరుశనగ, రాగి పంటలను సాగు చేశాను. రబీలో ఎక్కువ విస్తీర్ణంలో బిందు, తుంపర పరికరాల ద్వారా పంటలను సాగు చేస్తున్నాను.

– రవికుమార్ రైతు, తురుకువాండ్లపల్లి, మడకశిర

రైతులకు అన్ని విధాలా అండ



బోరు బావుల కింద నీటి సౌకర్యం ఉన్న రైతులకు రబీ పంటల సాగుపై గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి పంట సాగుకు ప్రోత్సహిస్తున్నాం. చిరుధాన్యాల పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం కూడా వారికి అన్ని విధాలా అండగా ఉంది.

– తిమ్మప్ప, వ్యవసాయ అధికారి మడకశిర మండలం

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- మహిళలంటే గౌరవం లేని వ్యక్తి ఎమ్మెల్యే బాలకృష్ణ
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అర్హులైన కుటుంబాలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 2వ వార్డు చౌడేశ్వరీకాలనీలో కౌన్సిలర్ రామచంద్ర ఆధ్వర్యంలో జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం దీపిక మాట్లాడుతూ సీఎం జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి అర్హులందరికీ ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వలంటీర్లు కూడా సేవాభావంతో పనిచేస్తున్నారన్నారు. 1వ తేది వస్తే వృద్ధులు, వికలాంగులు, వితంతులు ఇలా అందరి ఇంటికెళ్లి పింఛన్లు అందిస్తూ వారి ముఖాల్లో నవ్వులు పూయిస్తున్నారని పేర్కొన్నారు. అమ్మ నిజమైన దేవత అని ఆ తర్వాతే ఎవరైనా అన్నారు. ఇలాంటి తల్లి, అక్క, చెల్లెళ్లపై అనుచితంగా ఓ ఎమ్మెల్యే స్థాయిలో ఉండి మాట్లాడితే ఏమనాలో మీరే చెప్పాలన్నారు. సినిమా నటుడు కూడా అయిన ఎమ్మెల్యే బాలకృష్ణ ... అమ్మాయి కనిపిస్తే ముద్దయిన పెట్టాలి... కడుపైనా చేయాలని నీచంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే కావాలా? అని ప్రశ్నించగా... ప్రజలు వద్దు వద్దు అంటూ నినాదాలు చేశారు. దయచేసి రానున్న ఎన్నికల్లో మహిళామణులు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు గౌరవం, సముచిత స్థానం కావాలంటే మళ్లీ తిరిగి జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమాల్లో హిందూపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, శివ, ఆసీఫ్‌వుల్లా, షాజియా, మల్లికార్జున, రోషన్‌అలీ, నాయకులు మహేష్, నాగరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ బీ బ్లాక్ కన్వీనర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప కోరారు. బుధవారం పట్టణంలోని పెనుకొండ రోడ్డు వార్డు సచివాలయం పరిధిలో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వాల్మీకి సర్కిల్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే సచివాలయం ఎదుట ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు అన్సర్, అంజన్, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ సువర్ణ పాలన అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని సర్పంచ్ అనిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దొడ్డేరి సచివాలయం ఆవరణలో ఈఓఆర్డీ క్రిష్ణప్ప అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీలు జగదీష్‌బాబు, లింగరాజు, లక్ష్మమ్మ, వైస్ సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు పెట్టారు, పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎంపీపీ ప్రమీల పిలుపునిచ్చారు. బుధవారం గోరంట్ల మేజర్ పంచాయతీలోని 4వ సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షులు నూర్‌మహమ్మద్, మండల సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి, పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మాజీ పట్టణ కన్వీనర్ మేదర శంకర తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, జేసీఎస్ కన్వీనర్, సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం గుణేమోరబాగల్ గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

పెనుకొండ రూరల్: పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎర్రమంచి సర్పంచ్ నాగమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని కురుబవాండ్లపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామాంజినేయులు, చెన్నకేశవులు, పూజారి నాగేంద్రప్ప, మారుతి, రత్నాలు తదితరులు పాల్గొన్నారు.


కురుబవాండ్లపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు


పరిగి: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మారుతీ నగర్‌లో..

పట్టణంలోని 5వ వార్డు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వివరాలకు సంబంధించి ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును నగర పంచాయతీ చైర్మన్ ఉమ్మర్ ఫరూఖ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, గణప్ప, బాబు, శ్రీరాములు, ఫరీద్, టౌన్ కన్వీనర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: రాష్ట్రంలో జరిగిన సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఏరాష్ట్రంలో జరగలేదని, అందుకే మళ్లీ జగనన్నే ప్రజలు సీఎంగా కోరుకుంటున్నారని వక్తలు తెలిపారు. మండలంలోని శాసనకోటలో బుధవారం 'వై ఏపీ నీడ్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప, సర్పంచ్ మాలతి , ఈఓఆర్డీ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్ ఎంపీటీసీ బెస్త నాగజ్యోతి, మారుతీరెడ్డి, చిక్కన్న, జేసీఎస్ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మడకశిర: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


రొళ్ల మండలం దొడ్డేరిలో జెండాను ఎగురవేస్తున్న దృశ్యం


గోరంట్ల: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


గుడిబండ: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శుభకార్యం


ప్రత్యేక పూజా కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జయచంద్రారెడ్డికి చెందిన నూతన గృహ ప్రవేశ వేడుకకు బుధవారం ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి గాయపడిన సంఘటన పట్టణ సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు... రొద్దం మండలంలోని కొగిర గ్రామానికి చెందిన ఆంజనేయులు తన మిత్రునితో కలసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామమైన కోగిర వెళ్తున్నాడు. అయితే మార్గమధ్యలో మెడికల్ కళాశాల సమీపంలోకి రాగానే మడకశిర వెళ్తున్న ఓ కారు అద్దం తగలడంతో బైక్ అదుపు తప్పింది. గాయపడిన ఆంజనేయులను స్థానికులు వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఘనంగా మారెమ్మ జలధి ఉత్సవం


మారెమ్మకు గంగ పూజ చేస్తున్న దృశ్యం

పావగడ: నిడుగల్ సంస్థానంలోని హొట్టేబొమ్మనహళ్లి, క్యాతగానహళ్లి గ్రామాల మధ్య ఉన్న కావలు మారెమ్మదేవి నూతన విగ్రహానికి రామతీర్థంలో బుధవారం జలధి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంగ పూజ నిర్వహించారు. అనంతరం మారమ్మ దేవి విగ్రహాన్ని ఊరేగింపుతో తరలించి ఆలయంలో ప్రతిష్ఠించారు.

సముచిత స్థానం కల్పించిన వారికే మద్దతు

పెనుకొండ: మాదిగలకు సముచిత స్థానం కల్పించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు తెలిపారు. నవంబర్ 30న యుద్ధభేరి మహాసభలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో బుధవారం నాయకులతో కలసి చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు రామాంజప్ప, పెడబల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నవయసులోనే పుస్తెల భారం వద్దు


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

అమరాపురం: బాలికలు చదువుకునే వయసులో పుస్తకాలు పట్టి చదువుకోవాలని, పుస్తెల భారం మాత్రం మోయవద్దని గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి, ఆర్డీటీ ఎస్డీఎల్ ఆదినారాయణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న కేజీబీవీలో ఆర్డీటీ, మహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ అందరి బాధ్యత అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునిస్వామి, ఎంఈఓ వెంకటరమణనాయక్, ఏఎస్ఐ.రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అమరాపురం: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సచివాలయం అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. మండలంలోని హలుకూరు గ్రామ సచివాలయంలో ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ప్రజలు వివిధ సమస్యల పై వస్తుంటారని వచ్చిన వారితో సక్రమంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమక్క, కార్యదర్శి నరేష్, సచివాలయలం సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి


నిద్రగట్టలో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని నిద్రగట్ట గ్రామంలో బుధవారం కెంపేగౌడ జయంతి ఉత్సవాలను కుంచిటిగ వక్కలిగులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కుంచిటి వక్కలిగుల కుల బాంధవుడు, బెంగళూరు నగర నిర్మాత కెంపేగౌడ చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి పూజలు చేశారు. అనంతరం బాలికలు, యువతులు కలశాలను మోసుకుని గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలకు యువతీ యువకులు చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. కుంచిటి వక్కలిగులకు మార్గదర్శకుడు కెంపేగౌడ అని వక్తలు తెలిపారు.

నేటి నుంచి అన్నదానం


కరపత్రాలను విడుదల చేస్తున్న అయ్యప్ప మాలధారులు

హిందూపురం టౌన్: పట్టణంలోని కల్లూరు సుబ్బారావు పార్కు వద్ద ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు గురువారం నుంచి మధ్యాహ్నం పూట అన్నదానం ప్రారంభిస్తున్నట్లు ఆలయ గురుస్వామి బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. గురుస్వామి మాట్లాడుతూ ఆలయంలోని అన్నదాన భవనంలో గురువారం నుంచి డిసెంబర్ 31 వరకూ ప్రతిరోజూ మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 వరకూ అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అమరాపురం: మండలంలోని హలుకూరు గ్రామ సచివాలయం 1 పరిధిలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

అగళి: మండలంలోని ఇరిగేపల్లి సచివాలయం ఆవరణలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్ప తెలిపారు.ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరువుతారన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని సీ కొడిగేపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత, మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొంటారన్నారు.

లేపాక్షి: మండలంలోని మానేపల్లిలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.